
# తండ్రి మనసు



ఆంధ్రభూమి వీక్లీ.. 16 అక్టోబర్, 2003

"అమ్మా వాణీ! నా మాట విని అజయ్ విషయం మరచిపో. నేను నీకు మంచి సంబంధం చూసి పెళ్ళి చేస్తాను!"

పార్థసారథి- కూతురు శ్రీవాణితో అన్నాడు.

"సారీ నాన్నా! ఆడది తనను ప్రేమించేవాడితోనే సుఖపడుతుంది. నేను అజయ్‌ని మరచిపోలేను!" స్థిరంగా అంది శ్రీవాణి.

"కానీ, అతని ప్రేమలో నిజాయితీ ఉన్నప్పుడే నీవన్నది నిజమౌతుంది. అసలు నువ్వు అతని గురించి పూర్తిగా తెలుసుకున్నావా? అతని ప్రవర్తన గురించి విచారించావా? అతని

తల్లిదండ్రులు అతని పట్ల సంతోషంగా ఉన్నారా? అతనికి చెడుఅలవాట్లు ఏవైనా ఉన్నాయా? ఇవన్నీ తెలుసుకోకుండా నిన్ను ప్రేమిస్తున్నాడని పొంగిపోయి పెళ్ళి చేసుకోవడం అవివేకం!"

"నాన్నా... నేనూ చదువుకున్నాను. నాకు ఆమాత్రం తెలియదా? అజయ్‌కి చెడు అలవాట్లు లేవు. అతనికి తల్లిదండ్రుల్లేరు. మేనమామ దగ్గరే పెరిగాడు. వాళ్ళు అతనివల్ల సంతోషంగానే ఉన్నారు."

"అతని ఉద్యోగం చిన్నదంటున్నావు! నువ్వు ఏ లోటూ తెలియకుండా పెరిగినదానివి. ఆ సంపాదనకి అడ్జస్ట్ కాగలవా?"

"ఆయనకోసం ఎటువంటి కష్టాలనైనా ఎదుర్కోవడానికి నేను సిద్ధమే నాన్నా!"

"నువ్వు పదేపదే సినిమా డైలాగులు చెబుతున్నావు తప్ప- నా బాధ అర్థంచేసుకోవడం లేదు. ఎవరో ముక్కూ, మొహం తెలియనివాడికి నీకిచ్చి పెళ్ళిచేసి మనశ్శాంతిగా ఉండలేను. నిన్ను కళ్ళల్లో పెట్టుకొని పెంచిన మాకోసమైనా నువ్వు మనసు మార్చుకోలేవా?"

"మీరు అజయ్ గురించి అన్నీ కనుక్కొనే మా పెళ్ళి చేయండి. నాకోసం ఎంతో చేసిన మీరు ఈ ఒక్కటి కూడా చెయ్యండి... మమ్మల్ని ఆశీర్వదించండి!"

"నీకంటే ముందు పుట్టిన శ్రీలేఖ పెళ్ళి చెయ్యాలి. ఆమెకు సంబంధం కుదిరేవరకూ ఆగు!"

"సారీ నాన్నా! వీలైనంత తొందరలో మా పెళ్ళి జరుగుతుంది. మీరొప్పుకుంటే... వైభవంగా! లేకుంటే- గుళ్లో సింపుల్‌గా!" అంటూ తన గదిలోకి వెళ్లిపోయింది శ్రీవాణి.

ఏం చేయాలో తోచనట్లు నిలబడిపోయాడు పార్థసారథి.

● ● ●

శ్రీవాణి పెళ్ళి గుళ్లో జరిగింది!

అజయ్ ఫ్రెండ్స్, అతని మేనమామ ఫ్యామిలీ పెళ్ళికి హాజరయ్యారు. ఆ ఊళ్లోనే ఓ ఇల్లు అద్దెకు తీసుకుని, కొత్త సంసారం ప్రారంభించారు నూతన దంపతులు.

ఆరునెలల తరువాత శ్రీవాణి అక్క శ్రీలేఖకు పెళ్ళి కుదిరింది.

ఆ వార్త విని శ్రీవాణి ఎంతో సంతోషించింది. పెళ్ళికి పిలవడానికి తల్లి గిరిజ- శ్రీవాణి ఇంటికొచ్చింది.

తల్లిని చూడగానే ఆనందంతో కౌగలించుకుంది శ్రీవాణి.

తర్వాత "నాన్నకు చెప్పే వచ్చావా అమ్మా..?" అని అనుమానంగా అడిగింది.

"మీ నాన్నే నన్ను పంపారమ్మా! శ్రీలేఖకి పెళ్ళి కుదిరిందన్న విషయం నీకు తెలుసు కదా! నిన్నూ, అల్లుడిగారినీ పెళ్ళికి పిలుచుకు రమ్మన్నారు నన్ను. అల్లుడుగారు లేరా?"

"ఇంకా ఆఫీసు నుంచి రాలేదు" అంటూ వంటగదిలో కెళ్ళి కాఫీ తయారుచేయసాగింది శ్రీవాణి.

గిరిజ కూడా ఆమె వెనకే వెళ్లి కొంతసేపు మాట్లాడుతూ ఉండిపోయింది.

కాఫీ త్రాగాక శుభలేఖ ఇచ్చి- 'పెళ్ళికి తప్పకరమ్మనీ, అజయ్‌కి కూడా చెప్పి పిలుచుకు రమ్మనీ, వీలైతే అజయ్ ఉన్నప్పుడు వచ్చి స్వయంగా పిలుస్తామనీ' శ్రీవాణితో చెప్పి వెళ్లిపోయింది గిరిజ.

పెళ్ళికి వెళ్ళిన శ్రీవాణిని బంధువులందరూ ఆప్యాయంగా పలుకరించారు.

పార్థసారథి మాత్రం బిజీగా ఉండటంతో శ్రీవాణిని చూడలేదు. అది ఆమెను చాలా బాధపెట్టింది. ఆమెకు అక్కడ ఉండాలనిపించక వడివడిగా గేటువైపు నడవసాగింది.

'తన తండ్రికి ఇంకా తనపై కోపం పోలేదు!' అనుకుంటూ నడుస్తున్న ఆమెకు– వెనుకనుంచి 'అమ్మా...' అన్న పిలుపు వినిపించి, వెనక్కి తిరిగిచూసింది. ఎదురుగా పార్థసారథి నిలబడి ఉన్నాడు.

"భోజనం చేసి తాంబూలం తీసుకుని వెళ్లమ్మా! అల్లుడుగారు రాలేదా?" ఆప్యాయంగా అడిగాడు పార్థసారథి.

"లేదు నాన్నా! తప్పనిసరిగా క్యాంపుకు వెళ్లవలసి వచ్చింది. మధ్యాహ్నానికి వచ్చేస్తానన్నారు."

తండ్రి తనతో మాట్లాడడం ఆమెకు ఎంతో సంతోషాన్ని కలుగజేసింది.

శ్రీలేఖ అత్తగారింటికి వెళ్లేంతవరకూ తల్లితోనే ఉండి ఆమెకు అన్నిపనుల్లో సహాయం చేసింది శ్రీవాణి. అజయ్ కూడా పార్థసారథికి తోడుగా ఉండి అతని పనులు పంచుకున్నాడు.

ఇంటికి వచ్చాక తల్లిదండ్రులిచ్చిన తాంబూలం ప్యాకెట్ విప్పింది శ్రీవాణి.

తనకీ, భర్తకీ పెట్టిన బట్టలతోపాటు ఓ కవరు కూడా కనిపించింది. కవర్లో ఉత్తరం, ఓ చెక్కు కనిపించింది.

తండ్రి తనకు రాసిన ఉత్తరమది!

తీసి చదవసాగింది–

"మీ అక్క పెళ్ళికి రెండులక్షలు ఖర్చు పెట్టాను. రెండులక్షలు ఖర్చుపెట్టి నీకు పెళ్ళి చేసే అవకాశం నువ్వు నాకివ్వలేదు. అయితే... నా ఇద్దరు కూతుళ్ళనూ నేను ఎప్పుడూ సమానంగానే చూసుకున్నాను. అందుకే ఈ రెండులక్షల చెక్కు నీకిస్తున్నాను."

చెక్కునీ, ఉత్తరాన్నీ భర్తకు చూపించింది. కొంతసొమ్ముతో ఇంటికి కావలసిన ముఖ్యమైన వస్తువులు కొని, మిగిలిన సొమ్మును బ్యాంకులో దాచుకోవాలని నిర్ణయించుకున్నారు వాళ్ళిద్దరూ.

• • •

శ్రీవాణి ఇంటికి వచ్చిన గిరిజ– తన చేతిలోని న్యూస్ పేపరును కూతురికిస్తూ–

"ఇందులో మీ నాన్నగారి గురించి రాశారు... చదువు!" అంది ఆనందంగా.

శ్రీవాణి పేపరు అందుకుని చదివింది–

'శతాధిక కథారచయిత పార్థసారథి!' అన్న హెడ్డింగుతో ఆయన గురించి, ఆయన కథల గురించి రాశారు.

పేపరు చదివి తల్లికిస్తూ– "ఆయన ఎంత బాగా రాసినా– ఆచరణలోకి వచ్చేసరికి మామూలు మనిషిగానే ప్రవర్తించాడు. అక్కది కూడా నాలాగే ప్రేమవివాహమే! అయితే ఆయన ఎంతో వైభవంగా పెళ్ళి చేశారు. నా పెళ్ళి చూడడానికి కూడా రాలేదు. కారణం... బావ మన బంధువులబ్బాయి, ఒకే కులంవాడు! ఈయన కులం వేరు కనుక ఈయన్ను అల్లుడిగా చేసుకోవడానికి మనసు రాలేదు. 'నీతులు ఎదుటిమనిషికి చెప్పడానికే' అని ఆయన ఋజువు చేశారు!" అంది ఈసడింపుగా.

"ఆయన పట్టింపు– కులం గురించి కాదమ్మా... మీ ఆయన జీతం గురించి! కట్టుకున్న భార్యకు ఓ పట్టుచీర కూడా కొనివ్వలేని అసమర్థుడని!" అంది గిరిజ.

"అమ్మా! ఆయన గురించి ఏమైనా అన్నావంటే బాగుండదు. నన్నేమైనా అను... పర్వాలేదు. అయినా... ఆయన నుంచి నేను కోరేది పట్టుచీరలు కాదు- ప్రేమ, అనురాగం!" అంది శ్రీవాణి కోపంగా.

"ఆరునెలల అనుబంధానికే నీ భర్తనంటే అంత కోపం వచ్చిందే?! మరి, మీ నాన్నతో పాతికేళ్ల అనుబంధం ఉన్న నాకు- ఆయన్నంటే ఎంత కోపం రావాలి?" అంది గిరిజ నవ్వుతూ.

తనకు బుద్ధి చెప్పడానికే తన తల్లి తన భర్త గురించి అలా మాట్లాడిందని అర్థమైంది శ్రీవాణికి.

"సారీ అమ్మా! నిన్ను నొప్పించాను... నన్ను క్షమించు!" అంది పశ్చాత్తాపంగా.

"నువ్వు ఈరోజు ఆ మాటన్నావు గనక అసలు విషయం చెబుతాను విను. అజయ్‌ని మరచిపొమ్మని మీ నాన్నగారు నీకు ఎంతగానో నచ్చచెప్పినా నువ్వు వినలేదు. ఇక నీ నిర్ణయం మారదని తెలుసుకుని అజయ్ గురించి విచారించారు. అతని జీతం గురించి తప్ప- ఇంకే విషయంలోనూ అతన్ని కాదనడానికి కారణం కనిపించలేదు మీ నాన్నగారికి. అయితే మీ పెళ్ళికి పెట్టే ఖర్చు మీకే ఇచ్చేస్తే మీ సంసారానికి, అవసరాలకి ఎంతో ఉపయోగపడుతుందని ఆయన యోచించారు. కానీ, మీ పెళ్ళికి ఒప్పుకున్నాక, నీ పెళ్ళి- గుడిలో సింపుల్‌గా చేస్తానంటే నువ్వు ఒప్పుకునేదానివా? అందుకే మీ పెళ్ళి ఇష్టం లేనట్టు నటించి మీ పెళ్ళి మీరే చేసుకునేలా చేశారు. పైగా, మీ పెళ్ళి సింపుల్‌గా చేస్తే మన బంధువులు ఆయన్ని ఓ పిసినారిగా చిత్రించి ప్రచారం చేసే అవకాశం కూడా ఉంది. శ్రీలేఖ పెళ్ళి కాగానే ఆమె పెళ్ళికి ఎంత ఖర్చయిందో అంత మొత్తాన్నీ మీకందించారు. శ్రీలేఖ పెళ్ళి ఘనంగా చెయ్యడానికి కారణం... వాళ్ళిద్దరూ మంచి ఉద్యోగాల్లో ఉన్నారు కాబట్టి! తల్లిదండ్రులు ఏదైనా అన్నా- అది పిల్లల మంచి కోసమే! ఏది చేసినా అది వాళ్ళ భవిష్యత్తు కోసమే!!"

"మరి, ఇన్నాళ్లూ మా ఇంటికి ఎందుకు రాలేదు ఆయన?" శ్రీవాణి ప్రశ్నించింది.

"మీమీద ఉన్న కోపం వల్ల! అది నువ్వు అజయ్‌ని పెళ్ళి చేసుకున్నందుకు కాదు- కనీసం శ్రీలేఖ పెళ్ళి వరకూ మీరు ఆగలేకపోయినందుకు! అయితే ఆ కోపం కొద్దిరోజులే ఉండింది. నువ్వు వచ్చి ఆయన్ని పిలిచి ఉంటే తప్పకుండా నీ ఇంటికి వచ్చి ఉండేవారు."

"అయితే ఇప్పుడు రానా నీతో? ఆయన్ని క్షమించమని కూడా అడగాలి... అపార్థం చేసుకున్నందుకు!"

"పెళ్ళయ్యాక మొదటిసారి పుట్టింటికి వస్తున్నావు కాబట్టి- మీ ఆయన వచ్చాక ఇద్దరూ కలిసి రండి... మా ఆయన మిమ్మల్ని రిసీవ్ చేసుకుంటారు!" అంది గిరిజ నవ్వుతూ.

"థాంక్యూ అమ్మా... థాంక్యూ!" అంటూ తల్లి చేతిని పట్టుకుని ఊపేసింది శ్రీవాణి ఆనందంతో.